ఆర్థిక సాయం

జీడిమెట్ల: విశ్వ ఎంపవర్‌మెంట్ అండ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (వెస్సో) వారు ఓ నిరుపేద నవ వధువు కుటుంబానికి అండగా నిలిచారు. సుభాష్‌నగర్‌కు చెందిన మసంగారు రామకృష్ణ చారి ఓ సంస్థలో హెల్పర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె వివాహం ఈనెల 10న జరిగింది. అయితే వారిది నిరుపేద కుటుంబం కావడంతో రామకృష్ణ చారి కుత్బుల్లాపూర్ వెస్సో ఆర్గనైజేషన్ సభ్యులను ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని కుత్బుల్లాపూర్ సంఘం సభ్యులు ట్రస్ట్ దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి నవ వధువు తండ్రికి ఆదివారం రూ.45 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వెస్సో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బంగారు తాతారావు దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన వ్రతాల్లో భక్తులు

కుత్బుల్లాపూర్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లో, వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. స్థానికులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి రామాచారి పేర్కొన్నారు.

పగలే.. వెలుగు..!



విజయనగర్‌కాలనీ అంబేడ్కర్ విగ్రహం వద్ద పగలే వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

రంగారెడ్డినగర్: విజయనగర్ కాలనీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద హైమాస్ట్ లైట్లు ఆదివారం మధ్యాహ్నం వరకు వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్ బిల్లులు ఒక రోజు ఆలస్యమైతే కనెక్షన్ కట్ చేసే అధికారులు వీధి దీపాలకు మాత్రం టైమర్లను ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీసీ కోర్ కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ బీసీ కోర్ కమిటీ ముఖ్య నాయకుల ఏడో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడు లింగాల గంగాధర్, సీనియర్ నాయకులు సాయి రాజ్, శ్రీనివాస్‌గౌడ్, కుమార్ యాదవ్ (సూపర్), నర్సింహా యాదవ్, దుర్గాప్రసాద్, బొండాడ శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో బీసీ సమాజాన్ని ఐక్యం చేయడంలో మరింత బలంగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. అలాగే సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగంతం చేయడం, వివిధ డివిజన్లకు చెందిన బీసీ సభ్యులకు బాధ్యతలు అప్పగించడం, కాంగ్రెస్‌లో ఎన్ఎంసీ పరిధిలో పక్కా ప్రణాళిక ప్రకారం జరుగుతున్న కొన్ని ఘటనలకు సంబంధించి హన్మంత్‌రెడ్డితో చర్చించి తదుపరి కార్యాచరణ సిద్ధం చేయాలని నిర్ణయించారు.

బహుజనులు రాజ్యాధికారానికి కృషి చేయాలి

ఘట్‌కేసర్: బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఏకం చేసి బహుజన రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని అంబేడ్కర్ యువజన సంఘం సభ్యుడు, మాజీ వార్డు సభ్యుడు ఆనంద్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలందరూ సమానమేనని అందరికీ ఓటు హక్కు, ప్రాథమిక హక్కులు రాజ్యాంగం ద్వారా అందజేశాడన్నారు. లాల్ నీల్ కలిసి రాజ్యాధికారం సాధించాలని, అంబేడ్కర్ ఆలోచన విధానాలను నేటి యువత అనుసరించాలని సూచించారు. దాసు, రాందాసు, రాజేష్‌కుమార్, రవి, శ్రీకాంత్, అంజయ్య, గణేష్‌గౌడ్, శేఖర్, విష్ణు, వివేక్, అఖిల్, లలిత్, సోము పాల్గొన్నారు.

బాక్స్ నాలాలు శిథిలం..!

- యథేచ్ఛగా సామగ్రి, వాహనాల పార్కింగ్
- ధ్వంసమవుతున్న నాలా పైకప్పులు
- మరోవైపు పూడికతో నిండిన వైనం
- వర్షం వస్తే ఇళ్లలోకే వరద నీరు
- ఇబ్బందుల్లో స్థానికులు
- పట్టించుకోని అధికారులు



హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశాన్ని ఆనుకుని భగత్‌సింగ్‌నగర్‌లో బాక్స్ నాలాపై నిలిపిన వాహనాలు, సామగ్రి

చింతల్: వర్షం నీరు సాఫీగా వెళ్లేలా నిర్మించిన బాక్స్ నాలాల నిర్వహణను అటు అధికారులు, ఇటు స్థానిక సంక్షేమ సంఘం నేతలు గాలికొదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది బాక్స్ నాలాలపైనే సామగ్రి, వాహనాలు నిలుపుతుండడంతో కొన్ని చోట్ల అవి శిథిలావస్థకు చేరాయి. ఫలితంగా హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశం మీదుగా పై ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు బాక్స్ నాలాల్లో కలిసి రోడ్లపై పారుతూ ఇళ్లలోకి వచ్చి చేరుతోంది. వర్షం వచ్చిన ప్రతిసారి చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్, చంద్రనగర్, రంగనగర్, శివనగర్, చింతల్ తదితర బస్తీలు కాలనీలు నీట మునుగుతున్నాయి. ఈ బస్తీలు, కాలనీల్లోని బాక్స్ నాలాలు అధ్వానంగా మారాయి. అయినా ఆధునీకరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా హెచ్ఎంటీ జంగల్ నుంచి వచ్చే వరద నేరుగా విజయనగర్‌కాలనీ భగత్‌సింగ్‌నగర్, చింతల్, చంద్రనగర్ మీదుగా గణేశ్ నగర్ నాలాలో కలుస్తోంది.

నిరుపయోగంగా బాక్స్ నాలాలు..

వందలాది ఎకరాల్లో విస్తరించిన హెచ్ఎంటీ పరిశ్రమ ఖాళీ జాగా మీదుగా వచ్చే వరద నేరుగా విజయనగర్‌కాలనీ భగత్‌సింగ్‌నగర్ దీనికింద ఉన్న బస్తీలు కాలనీల ద్వారా మురుగునీరు వరద గణేశ్‌నగర్ నాలాలో కలుస్తాయి. ఇక్కడి మురుగునీటి కాలువలు వరద నీటి కాలువలను వర్షాకాలం రాకముందే వాటిలో పూడిక తీస్తే కొంతమేరైనా ముంపును అధిగమించే అవకాశం ఉండేది. కానీ స్థానికులు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్థానికంగా ఉండే గల్లీల్లో నీరు చేరి ఇళ్లలోకి వరద చేరుతోంది.

అక్రమ పార్కింగ్‌లతో బాక్స్ నాలాలు ధ్వంసం

కొన్నేళ్లుగా బాక్స్ నాలాలపై కొందరు స్థానికులు అక్రమంగా పార్కింగ్, భవన నిర్మాణ వ్యర్థాలు, బిల్డింగ్ మెటీరియల్స్ తదితర వంటి వాటిని డంపింగ్ చేస్తున్నారు. అయినా వారిని జీహెచ్ఎంసీ అధికారులు గానీ, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని నాలాలపై అక్రమ పార్కింగ్, డంపింగ్ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.



భగత్‌సింగ్‌నగర్, చంద్రనగర్ రోడ్డులో బాక్స్ నాలాపై నిలిపిన వాహనం



భగత్‌సింగ్‌నగర్‌లో బాక్స్ నాలాపై నిలిపిన ఆటో, వాహనాలు



భగత్‌సింగ్ నగర్‌లో వాహనాల పార్కింగ్‌తో విరిగిన నాలా పైకప్పు

ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ బోర్డు మాయం!



సర్వే నంబర్ 346లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు



ఈ నెల 15న ఉదయం బోర్డు లేని స్థలం

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తెల్లారేసరికే తొలగించారు. గాజులరామారం డివిజన్ కైసర్ నగర్‌లోని సర్వే నంబర్ 346 లోని 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గతంలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్‌కు కేటాయించింది. అయితే కోట్లు విలువ చేసే సదరు స్థలంపై కొంతమంది కన్ను పడడంతో ఈనెల 14న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో సదరు స్థలం ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు. అయితే బోర్డును తెల్లారేసరికి కొంతమంది మాయం చేశారు. ఈ విషయమై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీంను 'సాక్షి' వివరణ కోరగా బోర్డు తొలగించిన విషయం తమ దృష్టికి వచ్చిందని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అధికారులతో కలిసి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

82 మంది వాహనదారులపై కేసు

కుత్బుల్లాపూర్: బాలానగర్ ట్రాఫిక్ డీసీపీ పరిధిలో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 82 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. అల్వాల్, జీడిమెట్ల, బాలానగర్, మేడ్చల్ ట్రాఫిక్ పీఎస్‌ల పరిధిలో స్పెషల్ డ్రైవ్‌లతో పాటు డంక్రన్ డ్రైవ్‌లు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ బాలానగర్‌లో 24 మంది, జీడిమెట్ల పీఎస్ పరిధిలో 20, అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 20, మేడ్చల్ ట్రాఫిక్ పరిధిలో 18 మంది వాహనదారులు పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేశారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని నిరసన

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెనకు ఇరువైపుల ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆయా గుంతల వద్ద స్థానికులు ఆదివారం నిరసన చేపట్టారు. రోడ్డుపై ఏర్పడిన అడుగులోతు గుంతల్లో వాహనదారులకు గాయాలవుతున్నాయని, వాహనాలు దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు పలుమార్లు వినతిపత్రం అందజేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కాంట్రాక్టర్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రమేష్‌గౌడ్, వెంకటేశ్‌గుప్తా, చంద్రశేఖర్‌గుప్తా, ప్రేమ్‌కుమార్, ఖలీల్, రాములుముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సిండికేట్ బ్యాంక్ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసే అరకొర నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి అనేదే లేకుండా పోయిందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ఆశా నాయకులు కర్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, మన్నె ఉదయ్ యాదవ్, మక్కాల నర్సింగ్‌రావు, మేకల హరినాథ్ మక్కాల సత్యనారాయణ, బల్‌రాజు, చందుయాదవ్, అరవింద్, భాస్కర్, భిక్షపతి, భారతమ్మ, సూర్య ప్రకాశ్‌రెడ్డి, ప్రసన్న, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభావతి, సంధ్యారాణి, జగదీష్, పెద్దిరాజు మురళీమనోహర్, విజయకుమార్ కాలనీవాసులు మైపాల్ రెడ్డి, కృష్ణయ్య, సత్యమూర్తి, మాధవరెడ్డి, బాలయ్య, మల్లేశ్‌యాదవ్, బుర్రి యాదగిరి, మట్టి శ్రీను, పిట్ల రాజు, నగేశ్, కృష్ణారెడ్డి, రాజుగౌడ్, శ్యామ్ మోహన్, మహేశ్, ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్

పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

కీసర: రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. కీసర ఎస్సైలు, సిబ్బంది, కీసర మండల పరిధిలోని గ్రామపెద్దలు, వినాయక మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఇన్‌స్పెక్టర్ బాలస్వామి అన్నారు. ఆదివారం వినాయక చవితి మండపాల నిర్వాహకులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి మండపం నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలని, మండపంలో సీసీ కెమెరాలు బిగించుకోవాలని సూచించారు. డీజేల స్థానంలో సాంప్రదాయ కళాకారులతో కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. రోడ్డుపై దారికి అడ్డుగా మండపాలు ఏర్పాటు చేయకూడదని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని, భక్తులు, దేవుళ్లను కించపరిచేలా వ్యవహరించొద్దని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, ఎస్సై ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఆంజనేయులుయాదవ్, అన్ను, కుతుబ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

మేడ్చల్: వినాయక చవితి సందర్భంగా నిర్వహించే ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం వినాయక మండపాల నిర్వాహకులు, అన్ని పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సైలు సతీష్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ పాపన్నగౌడ్ జయంతి



నివాళులర్పిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌లో నూతన గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ హాజరై పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బహుజనులకు రాజ్యాధికారాన్ని సాధించేందుకు, దొరల అరాచకాలు, దౌర్జన్యాలను ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ పాపన్న అని కొనియాడారు. కార్యక్రమంలో ముద్దాపురం మాదన్‌గౌడ్, దేవేందర్‌నగర్ నూతన గౌడ సంఘం అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, వెండి రవి, ప్రభాకర్ గౌడ్, రవి కుమార్ గౌడ్, సత్యప్రకాశ్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పట్టాల ప్రదానం



పట్టా ప్రదానం చేస్తున్న అతిథులు

నిజాంపేట్: బీవీఆర్ఐటీ హైదరాబాద్ ఇంజినీరింగ్ కళాశాల ఫర్ ఉమెన్‌లో 10వ పట్టభద్రుల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 573 మంది విద్యార్థినులకు పట్టాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు, వేదిక్ రిక్రూట్‌మెంట్, స్ట్రాటజీ ట్రెనింగ్ డైరెక్టర్ డా.బీ రవీంద్రబాబు, కళాశాల ప్రిన్సిపాల్ డా.కేవీఎస్.సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్య అనేది డిగ్రీ పొందేందుకే పరిమితం కాకుండా, ఆలోచన విధానం, సమాజానికి సేవ చేయగల దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. పట్టభద్రత అంతిమ గమ్యం కాదని ఇది కొత్త ప్రయాణానికి ఆరంభం అని పేర్కొన్నారు.



పట్టాలు అందుకున్న ఉత్సాహంలో విద్యార్థినులు

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్స్

కుత్బుల్లాపూర్: మాజీ మున్సిపల్ చైర్మన్ కేఎం పాండు 81వ జయంతిని జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్‌లోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయం, చింతల్ ప్రధాన రోడ్డులోని పాండు విగ్రహాలకు అభిమానులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ గ్రామ అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, విద్యాభివృద్ధికి కృషిచేసిన మహోన్నత వ్యక్తి పాండు అని కొనియాడారు.

విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి

జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేస్తున్న వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి

పోచారం: ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్టార్టప్‌లను ఏర్పాటు చేసే వ్యవస్థాపకులుగా ఎదిగి, ఉద్యోగాలను సృష్టించాలని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (హైదరాబాద్) వైస్ చాన్స్‌లర్ ఆచార్య కిషన్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం యంనంపేట్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో జరిగిన 25వ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతీకరంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొంటూ.. విద్యార్థులు రాణించాలని సూచించారు. ఏటా విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య సుమారు 2.70 లక్షలకు చేరిందన్నారు. పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ.. సమాజ అవసరాలను తీర్చగలగాలన్నారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మహి మాట్లాడుతూ.. విద్యార్థులు అందుబాటులో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని కొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేయాలన్నారు. అనంతరం బీటెక్, ఎంబీఏ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. శ్రీనిధి సంస్థ సీఈఓ అభిజిత్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ డా.టీ.సీహెచ్.శివారెడ్డి తదితరులున్నారు.

గ్యాస్ రాయితీకి ఎదురుచూపు!

ఆధార్, రేషన్, బ్యాంకు ఖాతా ఉన్నా.. ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

- మహాలక్ష్మి పథకం కింద 79,553 మంది లబ్ధిదారులు
- జిల్లాలో ఇప్పటి వరకు పంపిణీ చేసిన సిలిండర్లు 4.54 లక్షలు
- 15 మండలాల్లో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 14.48 లక్షలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఆసరాగా ఉండేందుకు వంటగ్యాస్ సిలిండర్ రూ.500 ఇవ్వాలన్న ఉద్దేశంతో పథకాన్ని ప్రారంభించింది. రాయితీ సమయానికి రాకపోవడంతో లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. సమస్యల నివృత్తికి ప్రత్యేకంగా ప్రజాపాలన ఫిర్యాదు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం అంతగా కనిపించడం లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని మహిళలు గ్యాస్‌పై రాయితీ వస్తుందన్న ఆశలు పూర్తిస్థాయిలో నెరవేరడంలేదని ఆందోళన చెందుతున్నారు.

కేంద్రం రాయితీ ఓకే.. మరి రాష్ట్రానిది

గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.874 ఉండగా.. కేంద్రం రాయితీ రూ.47, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది రూ.328 పోగా, రూ.500కు మహాలక్ష్మి పథకం కింద సిలిండర్‌ను పొందాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ వినియోగదారుడి ఖాతాతో వారంలోగా జమ అవుతుండగా.. రాష్ట్రం నుంచి ఎందుకు సొమ్ము జమ కావడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

◆ పథకం లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ రాయితీ కోసం తిరుగుతున్నారు. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా వంటివి అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆందోళన అవసరం లేదు..

రేషన్‌కార్డు, ఆధార్ అనుసంధానం, తదితర కారణాలతో రాయితీ జమకాకుండా ఉండొచ్చని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా పౌరసరఫరాలశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. సిలిండర్ తీసుకున్న తర్వాత 4 రోజుల్లో రాయితీ జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. కానీ దీనిపై ఎలాంటి స్పష్టత లేదని పలువురి వాదన.

గ్యాస్ కనెక్షన్లు ఇలా..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో మొత్తంగా 14,48,889 గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. ఇందులో డబుల్ గ్యాస్ కనెక్షన్లు 8,52,468, సింగిల్ గ్యాస్ కనెక్షన్లు 5,11,324, దీపం కనెక్షన్లు 70,869, ఉజ్వల కనెక్షన్లు 2,593, కమర్షియల్ కనెక్షన్లు 11,635 ఉన్నాయి. మహాలక్ష్మి పథకం కింద 77,553 మంది లబ్ధిదారులు ఉన్నారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 4,54,859 సిలిండర్లు తీసుకున్నారు. వీటి కోసం ప్రభుత్వం రూ . 14.32 కోట్ల రాయితీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయినట్లు తెలుస్తోంది.

అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ..

రాష్ట్రం నుంచి సొమ్ము ఎందుకు.. ? జమ కావడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకం లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ రాయితీ కోసం ఎదురు చూస్తున్నారు. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ.. ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాయితీ వచ్చినా జమకాని సొమ్ము

గ్యాస్ సిలిండర్‌పై ప్రభుత్వం ఇచ్చే సొమ్ము బ్యాంకు ఖాతాలో జమకావడం లేదని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా కార్యాలయానికి వెళ్లి అడిగితే రాయితీ వచ్చిందని చెబుతున్నారని పేర్కొంటున్నారు. బ్యాంకులో అడిగితే రాలేదంటున్నారని, ఎందుకు..? జమ కావడం లేదో తెలియడం లేదంటున్నారు.